క్లుప్తంగా

తూటిపాలలో రైతు దినోత్సవం



రైతు వేషధారణలో చిన్నారి

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి గవిరెడ్డి వెంకటమోహన్ కొడవలి, వరికంకులు చేతపట్టి రైతు వేషధారణలో ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం కాలంలో రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించాడు. హెచ్ఎం రాము, ఉపాధ్యాయులు లోవరాజు, నారాయణరావు, సంతోషి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి

గొలుగొండ: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీపీ గజ్జెలపు మణికుమారి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆ శాఖాధికారులు స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్టు వివరణ ఇచ్చారు. నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీడీవో డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

121 మందికి వైద్య పరీక్షలు


ఆనందపురంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పాజి

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ నాయకుడు వంటాకు మహేష్ ఆధ్వర్యంలో ఆనందపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ వంటాకు అప్పాజి ప్రారంభించారు. పినాకిల్ ఆస్పత్రి వైద్యాధికారి దుర్గాప్రసాద్ 121 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 12 మందికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో మెరుగైన వైద్యం అందించేందుకు ఆస్పత్రికి తరలించినట్లు క్యాంప్ కోఆర్డినేటర్ నరేంద్ర అన్నారు. సిబ్బంది స్వాతి, భారతి, విన్నకోట అయ్యప్ప పాల్గొన్నారు.

వేచలం విద్యార్థుల ప్రతిభ

దేవరాపల్లి: వేచలం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో సత్తాచాటారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసారావుపేట డీఎస్ఏ క్రీడా మైదానంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. కె. సాయి కార్తికేయ 400 మీటర్ల హర్డిల్స్‌లోను, 400 మీటర్ల రిలేలోను తృతీయ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. అరకులో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలో పాఠశాల విద్యార్థిని వైజయంతి ప్రాతినిధ్యం వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించింది. ఈ మేరకు వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

పచ్చని కొండల్లో రయ్ రయ్!




చినగంగవరం నుంచి తాటిపూడికి నిర్మించిన సీసీరోడ్డు

రాళ్లూరప్పలపై తరతరాలుగా నడుస్తూ గిరిజనుల అరికాళ్లు బొబ్బలెక్కి కాయలు కాచినా గత పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. సరైన రవాణా సౌకర్యం లేక గమ్యస్థానానికి చేరాలంటే ఒళ్లంతా హూనమయ్యేది. దశాబ్దాలుగా వీరు పడుతున్న కష్టాలకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మోక్షం కలిగింది. నాణ్యమైన రహదారులు నిర్మించి డోలీ మోతల బాధలకు సైతం చెక్ పెట్టింది.

- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రగతిబాటలు
- రూ. 2 కోట్లతో గరిశింగి నుంచి తాటిపూడికి తారురోడ్డు
- రూ.60 లక్షలతో చినగంగవరం–తాటిపూడి రోడ్డు జంక్షన్‌కు సీసీరోడ్డు
- దశాబ్దాల కల నెరవేరడంతో తాటిపూడి గిరిజనుల హర్షం

మంజూరైన నిధులు..

గరిశింగి నుంచి తాటిపూడికి తారురోడ్డు: రూ. 2 కోట్లు	రోడ్డు విస్తీర్ణం : 2.4 కిలోమీటర్లు
రోడ్డు విస్తీర్ణం : 800 మీటర్లు	చినగంగవరం నుంచి తాటిపూడి రోడ్డు జంక్షన్ వరకు సీసీ రోడ్డు : రూ. 60 లక్షలు

దేవరాపల్లి: గరిశింగి పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామం తాటిపూడికి రవాణా సౌకర్యం కలిగింది. గ్రామానికి ఇటు చినగంగవరం, అటు గరిశింగికి సువిశాల తారురోడ్డు నిర్మించడంతో కొత్త రూపు సంతరించుకుంది. గరిశింగి–తాటిపూడి రోడ్డు నిర్మాణంతో గరిశింగి సచివాలయానికి చేరుకునేందుకు గిరిజన గ్రామంతోపాటు చినగంగవరం ప్రజలకు ప్రయాణం దూరం తగ్గింది.

ఇదే పంచాయతీ పరిధిలోని గరిశింగి నుంచి డొర్రిచెరువు గిరి గ్రామానికి రూ.1.12 కోట్లతో 2.3 కిలోమీటర్లు, చినగంగవరం నుంచి చింతలపాలెం గిరిజన గ్రామానికి రూ. 1.53 కోట్లతో 3 కిలోమీటర్ల మేర తారు రోడ్లు నిర్మించారు. వీటిని నిర్మించాలని గత టీడీపీ పాలకులకు మొరపెట్టుకుంటే హామీలతో మోసగించారని, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ పాలనలో తమ కష్టాలు తీరాయని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 104, 108 సేవలు సైతం అందుతున్నాయని చెబుతున్నారు.

అడగకుండానే రోడ్డు నిర్మించారు



ఎన్నికల సమయంలో ఎంతోమంది నాయకులు రోడ్డు నిర్మిస్తామని చెప్పి మోసగించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మేము అడగకుండానే మా గ్రామానికి తారు రోడ్డు నిర్మించారు. మాపై ఎంతో ప్రేమాభిమానాలు చూపించి, ఎన్నోయేళ్లుగా వేధిస్తున్న రోడ్డు కష్టాలను తీర్చారు.

– జన్ని రాము, గిరిజనుడు, తాటిపూడి, గరిశింగి పంచాయతీ

డోలీ మోతల బాధలు తప్పాయి..



కాలినడకన సైతం వెళ్లేందుకు రోడ్డు సదుపాయం లేకపోవడంతో నానా అవస్థలు పడేవారం. గర్భిణుల ప్రసవ సమయంలో డోలీ మోతలతో నరకయాతన అనుభవించాం. వైఎస్సార్‌సీపీ పాలనలో మా కష్టాలు తీరాయి. గిరిజనులంతా రుణపడి ఉంటాం.

– కాదల దుర్గాలమ్మ, గిరిజన మహిళ, తాటిపూడి


తాటిపూడి గిరిజన గ్రామానికి నిర్మించిన తారురోడ్డు (నేడు)


రహదారి సౌకర్యం లేని తాటిపూడి గిరిజన గ్రామం దుస్థితి (నాడు)

పీఏసీఎస్ రైతులకు 6శాతం డివిడెండ్

డీసీసీబీ సీఈవో వర్మ, డైరెక్టర్ సత్యనారాయణమూర్తి


రైతులకు డివిడెండ్ అందిస్తున్న సీఈవో వర్మ, సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు: స్థానిక పీఏసీఎస్ పరిధిలో ఈ ఏడాది వ్యవసాయ రుణాలు పొందిన రైతులకు డివిడెండ్‌ను డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి పంపిణీ చేశారు. పీఏసీఎస్‌కు వచ్చిన లాభాల్లో 6 శాతం నగదును రైతులకు డివిడెంట్ రూపంలో ఇచ్చినట్లు డీసీసీబీ డైరెక్టర్ తెలిపారు. సొసైటీ పరిధిలో 1,568 మంది రైతులకు 3 లక్షల 4వేల 470 రూపాయలను డివిడెండ్ రూపంలో అందించామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో చిన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వరం.. 'వైఎస్సార్ కంటి వెలుగు'


వృద్ధులకు కళ్లద్దాలను అందిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం వృద్ధులకు వరంగా మారిందని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. అక్టోబర్ 26న శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కె.కోటపాడులో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉచితంగా నేత్ర శస్త్ర చికిత్సలు చేశారు. వారిలో 9 మందికి కళ్లద్దాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.

మహిళా పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళిక


అవగాహన కల్పిస్తున్న వెలుగు ఏరియా కోఆర్డినేటరు సత్యనారాయణ

నాతవరం: మహిళా పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందని వెలుగు ఏరియా కోఆర్డినేటరు కె.సత్యనారాయణ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం జగనన్న పాల వెల్లువపై మహిళా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చూడి పాడి ఆవుకు రూ.75 వేలు, చూడి పాడి గేదెకు రూ.83 వేల రుణం ఇస్తామన్నారు. పాలు సరఫరా చేసే రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులు లోటుపాట్లుపైన చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో హనుమంతరావు, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, పశు వైద్యాధికారులు గుప్తా, మోక్షిత్‌రెడ్డి, శరణ్య మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పోలుపర్తి రాధ పాల్గొన్నారు.

పాలవెల్లువపై రైతులకు శిక్షణ

మాకవరపాలెం: స్థానిక స్త్రీశక్తి భవన్‌లో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై శనివారం పాడిరైతులకు శిక్షణ ఇచ్చారు. పశువుల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీలు, పాల దిగుబడి, తదితర అంశాలపై ఈ సందర్భంగా పశువైద్యాధికారి అశోక్ అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీలకు అమలు చేస్తున్న రాయితీలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి, వెలుగు ఏపీఎం చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగం అధ్యక్షుల నియామకం


వెంకటేష్ (చోడవరం)


మధు (బుచ్చెయ్యపేట)


కల్యాణం (రావికమతం)


రాజు (రోలుగుంట)

నర్సీపట్నం/చోడవరం/మాడుగుల: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల యువజన విభాగం అధ్యక్షుల జాబితాను పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం విడుదల చేసింది. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో యువతను నియమించింది.

నర్సీపట్నం నియోజకవర్గం..
నర్సీపట్నం మున్సిపాలిటీ – ధనిమిరెడ్డి ప్రసాద్
నర్సీపట్నం – డి.సురేష్‌నాయుడు
గొలుగొండ– మాకిరెడ్డి రామకృష్ణంనాయుడు
మాకవరపాలెం– పిల్లా శ్రీను
నాతవరం – బందారు పైడియ్యానాయుడు

చోడవరం నియోజకవర్గం...
చోడవరం – పుల్లేటి వెంకటేష్
బుచ్చెయ్యపేట – వేపాడ మధు
రావికమతం – శీలం కల్యాణం
రోలుగుంట – డి. రాజు

మాడుగుల నియోజకవర్గం...
మాడుగుల– కలిమి గోపాల్
కె. కోటపాడు – గొర్రుపోటు వెంకటరావు
దేవరాపల్లి – కర్రి సూరినాయుడు
చీడికాడ – గొల్లవిల్లి వి.టి. స్వామినాయుడు

సంతతోటలో ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: స్థానిక మహేశ్వరి థియేటర్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు 13 ఏళ్ల క్రితం చేపట్టిన రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి తమ ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలాలు మంజూరు కావడం ఆనందంగా ఉందని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. ఈ మేరకు సంతతోటలో 31 మందికి కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి తహసీల్దార్ ఎం. లక్ష్మితో కలిసి ఆమె శనివారం భూమిపూజ చేశారు. ఇటీవల హైకోర్టు తీర్పునను సరించి నిర్వాసితులకు ఇక్కడ ఇళ్లు నిర్మించనున్నారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వి. సింహాచలం నాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, గొర్రుపోటు రమాదేవి, కె.వి.రమణ, సోమిరెడ్డి పేరునాయుడు, వెత్సా రమేష్, వెత్సా రాజేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నర్సీపట్నం: స్థానిక సమిద స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్ఆర్సీ కౌన్సెలర్ గణపతి, ఏఆర్టీ కౌన్సెలర్ ప్రసాద్ పౌష్టికాహారం అవశ్యకత గురించి వివరించారు. సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వీరభద్రరావు వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమిద సంస్థ అధ్యక్షుడు రమణ, ప్రాజెక్టు మేనేజర్ వరహాలబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి

నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

మాకవరపాలెం: సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పిలుపునిచ్చారు. మాకవరపాలెం, రాచపల్లి, బూరుగుపాలెంలో శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నర్సీపట్నంలో సాధికార బస్సుయాత్ర జరగనుందన్నారు. దీనికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. నర్సీపట్నంలో జరిగే భారీ బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు భద్రాచలం, గొంతిన హరిబాబు, బాలకృష్ణ, సచివాలయ కన్వీనర్ రమణ, పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు గోవింద, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, యూత్ జిల్లా కార్యదర్శి నాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం


కొత్తకోటలో బోరు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రావికమతం: ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడపగడపకు నిధులు మంజూరు చేయడంతో గ్రామ గ్రామాన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తవుతున్నాయి. ఇందులో భాగంగా ఇక్కడ ఒకటో వార్డులో మంచి నీటి సమస్య పరిష్కారానికి రూ.లక్షతో ఏర్పాటు చేసిన చేతిపంపును ఎంపీటీసీ కుంచా లక్ష్మి, సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ శనివారం ప్రారంభించారు.


కవగుంటలో పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వరహాలు

సొంత నిధులతో పనులు

కవగుంటలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతోపాటు మరో రూ.5 లక్షలతో సీసీడ్రైనేజీలు, రోడ్లు ఇప్పటికే నిర్మించారు. ప్రధాన వీధిలో వాడుక నీరు పోయేందుకు నిర్మించిన సీసీ కాలువ పనులు కొంత మేర ఆగిపోయాయి. దీంతో సర్పంచ్ దాసరి సూర్యకుమారి భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు వరహాలు రూ.20 వేల సొంత నిధులతో కొబ్బరికాయ కొట్టి శనివారం పనులు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి పూజలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- గ్రామగ్రామాన అన్నసమారాధనలు


మాడుగుల రూరల్: కె.జె.పురంలో స్వామివారికి తిరువీధి ఉత్సవంలో భక్తులు


చోడవరం ఆపదశ్రీనివాసస్వామి క్షేత్రంలో పూజలు చేస్తున్న అర్చకులు


చోడవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ దాస సాహిత్య కోలాట బృందం


నర్సీపట్నం: ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి


రావికమతం: కొత్తకోటలో దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు


నర్సీపట్నం: దర్శనానికి బారులు తీరిన భక్తులు

చోడవరం/నర్సీపట్నం/మాడుగుల/రూరల్/రావికమతం/రోలుగుంట/మాకవరపాలెం/నాతవరం/చీడికాడ/దేవరాపల్లి: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని భక్తులంతా భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, ఏకాదశి పూజలతో వైష్ణవాలయాలన్నీ కిటకిటలాడాయి. చోడవరం మండలం గోవాడ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి. సన్యాసినాయుడు ప్రత్యేక పూజలు చేశారు. చోడవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ దాస సాహిత్య మహిళ బృందం కోలాటం అందర్నీ ఆకట్టుకుంది. ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్టు బోర్డు చైర్మన్ కందర్ప మాధురీ శంకర్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొని ప్రసాదం పంపిణీ చేశారు. కేశవస్వామి దేవాలయంలో మహాభారతం, భాగవతాల్లో ఘట్టాలను ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు ప్రవచనాలు చేశారు.

- నర్సీపట్నంలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.
- మాడుగుల మహరాజు కోట ఆవరణలో అతిపురాతన వేంకటేశ్వరాలయంలో ముక్కోటి పూజలు చేశారు. అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కె.జె.పురం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, సభ్యులు ఏర్పాట్లు చేశారు.
- రావికమతం మండలంలో మండల కేంద్రంతో పాటు మేడివాడ, కొత్తకోట శివాలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. కొత్తకోటలో దుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.
- రోలుగుంట కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పాలంకరణ కార్యక్రమాన్ని అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. వడ్డిపలో భక్తులు అధికంగా వచ్చి పూజలు చేశారు.
- నాతవరం మండలం ఎం.బి.పట్నం రామాలయంలో వ్యవసాయ శాఖ విశ్రాంత జేడీ వర్రే వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఏ శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వర్రే శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో పూజలు చేశారు.
- మాకవరపాలెం మండలం తామరం శ్రీవారి ఆలయంలో పూజలు ప్రారంభించారు. భక్తులు మాకవరపాలెం ఆర్టీసీ బస్టాండు నుంచి ఆలయం వరకు నగర సంకీర్తనగా భక్తిగీతాలు ఆలపించుకుంటూ వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది.
- చీడికాడ మండలం అర్జునగిరి స్వయంభూ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి ఆలయంలో తెల్లవారు జాము నుంచి పల్లకి సేవతో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అనంతరం నగర సంకీర్తనలు నిర్వహించారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దు

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లక్ష్మణమూర్తి


మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: సర్వసభ్య సమావేశంలో అడిగిన ప్రతి సమస్యనూ పరిష్కరించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధికారులకు సూచించారు. ఆయన అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. గత ప్రభుత్వంలో ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన అంగన్‌వాడీ కేంద్రాల భవనాలపై సర్పంచులు కాళ్ల సత్యనారాయణ, శెట్టి నూకరాజు, లోకవరపు సత్యనారాయణ ప్రశ్నించారు. వాటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ, పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మ తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మాధవనగరం సర్పంచ్ ఎస్.చినతల్లి కోరారు. అనంతరం ఎంపీపీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించేటప్పుడు సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ పైల సునీల్, ఎంపీడీవో హనుమంతరావు, కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు పాల్గొన్నారు.

దాతలకు సన్మానం

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలో శివాలయం, లక్ష్మీనారాయణ స్వామి ఆలయాల అభివృద్ధికి విశేష కృషి చేసి, విరాళాలు అందించిన దాతలను శనివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వెదురుపర్తి సుందరయ్య, తలారి అర్జున దంపతులను సత్కరించారు. సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఉప సర్పంచ్ గుణమ్మ, ఏఎంసీ డైరెక్టరు సయ్యపురెడ్డి నారాయణరావు, మాజీ ఉప సర్పంచ్ రాజేశ్వరావు పాల్గొన్నారు.